వారం రోజుల్నించి చూస్తున్నా, రోజూ సాయంత్రం ఏడు అయేసరికి భుజం చుట్టూ పమిట కప్పుకొని భుజానికో వ్యానిటీ బ్యాగ్‌తో ఆమె ఆ గదికి వస్తుంది

రాజమండ్రి నుంచి రామం ఉద్యోగం పని మీద వచ్చి పదిరోజులు అయింది. ఇంకొక రెండు రోజుల్లో పని పూర్తి అయిపోవచ్చు. వచ్చిన మొదటి రెండు రోజులూ సాయంత్రం గడపడం ఎలా అని సమస్యలో పడ్డాగానీ ఇప్పుడది లేదు.

ఎర్రగా సన్నగా నాజూకుగా నడుస్తూ రెసెప్షన్ గది నుంచి లిఫ్ట్‌లో నాలుగో ఫ్లోర్‌లో నా గాదికి పక్కగా ఉన్న గడిలోకి రోజూ సాయంత్రం వెళ్లే ఆమె ఎవరోగానీ, మంచి కాలక్షేపంగా ఉంది.

నా గది కార్నర్‌లో ఉండటంవలన అవతల గదిలోంచి మాటలు కాస్త జాగ్రత్తగా వింటే వినబడ్డాయి. ఆ గదిలో ఎవరుంటారో తెలీదు. సాధారణంగా సాయంత్రం ఏడు గంటలకి లాడ్జి గదికి ఆడది వస్తే వినబడే మాటలు ఏవీ వినబడటంలేదు.


ఆమె ఎవరు? ఎందుకు వస్తున్నది? క్రమంగా పెద్ద సమస్య అయికూర్చుంది.

ఆమె సెంటర్ హాల్‌లోకి ప్రవేశించినప్పటినుంచి అవతల గదిలోకి వెళ్లేదాకా చూపుల్తో అనుసరించడం పెద్ద అలవాటు అయిపోయింది. అయితే తిరిగి ఎన్ని గంటలకి వెళ్లి పోతుందో తెలీదు. కిటికీలో నుంచి ఆమె కోసం చూస్తూ నిద్రపోవడం అలవాటయింది.

వరండా కార్పెట్ మీద ఆమె నడుస్తుంటే ఏవో మెత్తటి పూలకి కాళ్లు వచ్చినడిచి పోతున్నట్లుంటుంది.

వెనక నుంచి చూసినా ఎదురుగా చూసినా ఏదో లోకాల్లో తేలిపోతున్న ఫీలింగ్. పాతికేళ్లు పైబడ్డ వయస్సు. చూపుల్లో మెర్క్యురీ అంత మెరుపు అనుభవజ్ఞుడయినచిత్రకారుడు కాయితాన్ని షేప్స్ ప్రకారం మడిచి విలబెట్టినట్లు కనబడే విగ్రహం.

# మనసున్న మనిషికి సుఖము లేదంతే...




'ప్రశాంత'

## 5 లక్షల మరణాలు

*మన దేశంలో సరియైన పోషకాహారం లోపించడం వలన ఏటా 5 లక్షల మంది పిల్లలు మరణిస్తున్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి తెలియజేసింది,*

*పోషకాహారం లోపించడం వల్లనే పేదకుటుంబాలకు చెందిన పిల్లలలో 70 శాతం మంది పెరుగుదల కొరవడుతున్నదని ఆ సంస్థ హెచ్చరిస్తున్నది.*

రాత్రి పదకొండు అయింది, తలుపు దగ్గర బజ్జర్ చప్పుడయింది.

'కమిన్'

తలుపు తెరుచుకొంది, ఎదురుగా ఆమె !

'ఎక్స్‌క్యూజ్ మీ'

'.........'

'గదిలో నీళ్లు రావడం లేదు. డ్యూటీలో బాయిస్ ఉన్నట్లులేదు. మీ రూంలో నీళ్ల ఏమన్నా ఉన్నాయా?'

ప్లాస్టిక్ వాటర్ జగ్ అందించా 'నీళ్ల అంత చల్లగా లేవు అనుకుంటా'

'ఫర్వాలేదు' అని వంగి జగ్ తీసుకుంటూ గమ్మత్తుగా నవ్వింది. వంగినప్పుడు మెడ మీద ఆమె జాకెట్ కట్స్ ఒళ్లంతా గుచ్చుకొన్నట్లు ఫీలింగ్.

పది నిమిషాల త్వరాత జగ్ తీసుకొచ్చి ఇచ్చి వెళ్తూ 'తలుపు వేసుకోండి, అసలే భయస్థుల్లా ఉన్నారు' అంది. ఆ అనడంలో రెచ్చగొట్టడం, వెక్కిరింపు అన్నీ ఉన్నాయి.

అనుకొన్న ప్రకారం రామం పని అయిపోయింది. నిజానికి నాకు ఇంకేం పనిలేదు. హైదరాబాదులో అదనంగా ఒక రోజు ఉండటం అంటే యాభై రూపాయలు ఖర్చు.

ఉండటమా వెళ్లడమా? ఉంటే ఎందుకు? ఎవరికోసం? ఆమె మీద కోరికా? పరిచయం పెంచుకోవాలని తపనా?

రోజంతా ఏం తోచడంలేదు. అయినా ఏం చెయ్యకుండా ఉండిపోడానికి అలవాటు పడ్తున్నా: ఆమె రోజూ వస్తూ చూసి నవ్వడం నేను స్వీకరించడం ?

ఏమిటీ ఆనందం ? సాధారణంగా ఏ ఆడదీ ఇంత తక్కువ పరిచయంలో, టాప్ చెయ్యలేదే ? ఎందుకీమె గురించి ఇంత ఆలోచన ? పతితా, పక్క సంపాదన కోసం హాబీగా ఇలా వస్తుంటుందా ? ఎవరూ లేరా ?...ఛ! ఏమిటి నేనిలా పిచ్చివాడిన్న అయిపోతున్నా ?--

మధ్యాహ్నం మూడు గంటలయింది. టాక్సీదిగి గదిలోకి వెళ్తూంటే పక్కగది బయటసలబడివుంది ఆమె.

'భోజనం చేశారా?'

తలఊపాను. ఇంకేదన్నా నేను మాట్లాడితే తనూ మాట్లాడ్తుంది. కానీ ఆమె కనబడటంతో ఏదో అయిపోడంలో మెదడుకి నాలుకకి సంబంధం దొరకడంలేదు.

'పడుకొంటున్నారా?'

'అబ్బే పగలుపడుకోను' పాలడ్రమ్ పగిలి నేలమీద పడ్డట్లు నవ్వు. ఏమిటి ఇంత అందంగా నవ్వుతుంది?

ఇద్దరికీ ఒకటే జబ్బు. బాగుంది. పోనీ మీగదిలో ఏమన్నా పుస్తకాలు ఉన్నాయా?

'నేనే మిమ్మల్ని అడగాలనుకొంటున్నా'

'మీకు నచ్చితే పట్టుకెళ్ళవచ్చు'

'పట్టుకెళ్ళడమే తప్ప తిరిగి ఇవ్వడం అలవాటు లేదు'

టేబుల్ మీద పుస్తకాలు చూస్తుంటే 'కూర్చోండి' అంది. పుస్తకాల్లో చూపులు. దృష్టి అంతా ఆమెమీద.

అందమైన సాఫీ బాటిల్‌లా ఆమె కూర్చుంది. సోఫామీద వాలి చూపుల్ని నామీద పరుస్తున్నది. ఆ చూపుల్లో ప్రాసిక్యూషన్ లాయరు స్పీడు ఉంది. హత్యానేర విచారణ జరుగుతున్న కోర్టు హాలు టెన్షన్ ఉంది.

పుస్తకాలు చూస్తూనే గది అంతా పరికించా. నా అనుమానాలకి ఏ ఆధారం దొరకలేదు. కాఫీ తాగుతుండగా మాటల్లో ఆమె భర్త జూయలాజికల్ డిపార్టుమెంటులో పని చేస్తాని తెలిసింది; నేనూ అదే డిపార్టుమెంటులో పనిచేస్తున్నందు వలన శిథిలాలు తవ్వకాలు మీదగా చాలాసేపు ముచ్చట్లు సాగాయి

ఉన్న రెండు బెడ్స్‌మీద చీరలు మాక్సీలు ఆడవాళ్ళలుంగీలు వంటివి తప్ప మరేంలేవు. ఎనిమిది అవుతుండగా నాకోసం మూర్తి వస్తే నాగదికి బయలుదేరా.

'ఎవర్రా ఆవిడ?'

'తెలీదు'

'తెలీకుండానే అన్ని కబుర్లు చెప్తున్నావా?'

'నీ మొహం'

'అదే చెప్తున్నా నీ మొహంకన్నా బాగానే ఉంది. ఎక్కడో చూసిన గుర్తు ఇంతకీ లాడ్జి సరుకా?'

'ఛ! ఏమిటా మాటలు?'

'ఎవర్నినో అంటే నీకేమిటోయ్ కోపం'?

'ఎవర్ని అన్నా తెలుసుకొని అనాలి. మూర్తి, ఆ మాటకి నన్ను గమ్మత్తుగా చూశాడు. భోజనాలు వచ్చాయి. బయలుదేరి సినిమాకి


# రూ. 8,000ల విలువగల బహుమతులు గెలవండి

నమూనా మొత్తం: 33    ప్రవేశ రుసుము లేదు.

| | | |
|---|---|---|
| 8 | 13 | 12 |
| 5 | 11 | 7 |
| 10 | 19 | 14 |

మొదటి బహుమతి: వాచీలు, కెమేరాలు, టేప్‌రికార్డర్, రికార్డ్ ప్లేయర్స్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్, వీటిలో ఏదో ఒకటి. కన్సొలేషన్ బహుమతి అమెరికన్ డిజైన్ చీరలు లేదా 3 బ్యాండ్ల హై-ఫై- ట్రాన్సిస్టర్ అమ్మకపు ధరకే వ్యాపారాభివృద్ధి పథకము. మిగిలిన ఎంట్రీలతో సరిపోలని ఎంట్రీకి మొదటి బహుమతి ఇవ్వబడుతుంది. ప్రమోటర్ల నిర్ణయం చివరిది మరియు చట్టబద్ధమైనది.

ముగింపు తేదీ: 26-9-77

నమూనాలో తెల్పిన విధంగా 9 ఖాళీగళ్ళను ఒక తెల్ల కాగితము పైని గీయండి. 8 (ఎనిమిది) నుండి 16 (పదహారు) వరకు అంకెలను ఉపయోగిస్తూ ఎటు కూడినా 36 (ముప్పై ఆరు) వచ్చునట్లుగా ఒకే అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించి పై ఖాళీ గళ్ళను నింపండి. ఫలితాలు తెలిపిన వెంటనే పోస్టేజి ప్యాకింగ్ ఖర్చులు డిపాజిట్ చేయవలసిందిగా విజేతలకు తెలియచేయబడుతుంది. ఇంటిమేషన్ లేఖలోని నియమ నిబంధనలను అనుసరించి ప్రయిజులు ఇవ్వబడుతాయి. ఒక కుటుంబంలో నుండి ఒక ఎంట్రీయే పంపించాలి. అన్ని వివాదాలూ ఢిల్లీ కోర్టులోనే.

**Shakti Enterprises**

22/7, KAILASHNAGRA, DELHI-31

వెళ్లాం. సినిమా మహాబోరుగా ఉంది. నాకు తెలీకుండానే ఆమె ఆలోచనల్లో పడ్డా.

ఇంటర్‌వెల్ లైట్లు వెలిగాయి. రెండు వరసలు అవతలగా ఆమె నీలం చీరలో కని పించింది. పక్కన ఎవరూలేరు. నా మనస్సు రెప రెప లాడింది. లేచి వెళ్లి పలకరించాలని పించినా మూర్తి ఉండటం వలన సాహసించ లేదు. ఆమే నన్ను గమనించి నట్లు చిన్న నవ్వు నవ్వింది.

సినిమా అయిపోయింది. ఆమె కన్నా ముందుగా బయటకి వెళ్లి మూర్తిని టాక్సీ ఎక్కించి పంపేశా. నా అంచనాసరి అయింది. ఆమె ఇంకా బయటే నిలబడి ఉంది. ఆమె దగ్గరికి వెళ్లి లాడ్జికేనా అన్నా.

ఆమె ఛక్‌మని చూసింది.

'సారీ' అని నవ్వేశా. ఇద్దరం బయలు దేరాం.

'మీ వారు ఊరికి వెళ్లారా?'

'అవును. ఇంక రారు,'

'అదేమిటి?'

'కొన్ని చోట్లకి వెళ్లిన వారు తిరిగి రారు.'

అప్పటికి ఆమె అభిప్రాయం అర్థం అయి 'ఐయాం సారీ' అన్నా.

'ఫర్వాలేదు. నేనేం సారీ ఫీల్ అవడం లేదు. ఆ మాటల్లో ప్రపంచాన్ని లెఖ్ఖ చెయ్యని నిర్లక్ష్యం. ఆ చూపుల్లో ఎదుటివాడ్ని రెచ్చగొట్టి ఏడిపించే స్వభావాన్ని మాటల్లో నిర్లక్ష్యాన్ని ఎందుకు గౌరవిస్తున్నానో అర్థం గాదు. రేవతి భార్యగా ఇన్నేళ్ల కాపరంలో ఎప్పుడు ఏకాస్త నిర్లక్ష్యంగా మాట్లాడినా భరించలేని నేను ఈవిడ దగ్గర ఎందుకు సహిస్తున్నా? సమాధానం లేదు

దాంతో పిల్లలు చదువులు స్వవిషయాలూ చెప్పింది. దాన్నిబట్టి రమణి ఒక విదేశీకంపెనీ మేనేజర్ దగ్గర పి. ఏ. గా పని చేస్తున్నట్లు, చాలా హైసొసైటీలో బతుకుతున్నట్లు తెలి సింది. మొత్తంమీద హైసర్కిల్స్‌లో సాధా రణంగా జరిగే చాలా వాటికి ఆమె అలవాటు పడ్డట్టు అర్థం అయింది. దానితో ఆమె అందని ద్రాక్షపండు కాదు. అనుభవానికి ఉపయోగపడే వ్యక్తిగా నిర్ణయించుకున్నా.

ప్రస్తుతం కాస్త ఆర్థిక ఇబ్బందల్లో ఉన్నట్లూ తెలిసింది. అయినా రమణి తెలివి గలది. సెన్సిటివ్ కూడా. అందుకే వెంటనే సాయం అందించబోతే మరో రకంగా ఎత్తి పొడుస్తుందేమోనని ప్రస్తుతానికి వాయిదా వేశా.

గదికి వచ్చేసరికి రెండు అయింది.

నిశ్శబ్దంగా స్తబ్దంగా మాననిక ఉత్సాహం లేకుండా పడి ఉండే వాళ్లంటే నాకు రోత, అసహ్యం. అందుకే నాకు రమణి నచ్చింది రమణి ఎక్కడ ఉన్నా జీవితాంతం ఆమె వెంట నేను ఉండాలనుకున్నా.

కారిడార్ నిశ్శబ్దంగా ఉంది. దూరంగా లైటు వెలుగుతున్నది. మెల్లిగా ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి చాలా ఆలస్యం అయింది గదూ అన్నా.

'అవును' నా నిద్రపాడు అయింది.'

"రేపు మీ ప్రోగ్రాం"

"బావగారికి ఒంట్లో బాగోక ఇక్కడ హాస్పిటల్‌లో చెకప్‌కి వస్తే వారం రోజు లుగా శెలవులో ఉన్నా. ఆయన ఇవాళే వెళ్లి పోయారు. రేపు మళ్లీ ఉద్యోగం మొదలు..."

"నాకు మాత్రం మీచేత ఇంకో వారం శెలవు పెట్టించాలని ఉంది,"

"ఇంకా..." రమణి తలుపు తీసింది. తలుపు తప్పుకొని ఆమెతో లోపలికి వెళ్ళా.

"నాకు మాత్రం ఎప్పుడూ మీతోనే ఉండిపోవాలని ఉంది."

"నాకు మాత్రం లేదు ...". నలభై సంవత్సరాల జీవితంలో మొదటి సారిగా రమణి నోట నేను సమాధానం చెప్పలేని ప్రశ్న. నా వ్యక్తిత్వం గొప్పదనం అహం అన్నీ ఉరిపోసుకు చావాల్సిన ప్రశ్న.

బలంగా దగ్గరికి లాక్కొని ముద్దుపెట్టుకున్నా. ఆమె విదిలించుకొని మంచం వేపు వెళ్ళింది.

"ప్లీజ్ రమణి నీకోసమే ఇన్ని రోజులు ఆగా."

"దేశంలో ఆడవాళ్ళు గొడ్డు పోయారా? డబ్బులు పారేస్తే వెట్టి చాకిరీ నుంచి వయస్సులో ఉన్న ఆడదాని దాకా అన్నీ దొరకుతాయి మనదేశంలో."

నేల మీదకూర్చుని ఆమె నడుం మీద తలపెట్టి దీనంగా ఆమె కళ్ళలోకి చూశా. ఆమె నును వేళ్ళు నా గడ్డంకింద కదుల్తున్నాయి.

"నిన్ను డబ్బుతో కొలిచాననుకున్నావా?"

"లేదు అనుభవంకోసం తపిస్తున్నారు."

"అంత నీచుణ్నా? ..."

"నువ్వు ఏం అనుకున్నా సరే ..." అర్ధరాత్రి మగాడి ఆవేశానికి ఏం అయినా వదిలేస్తాడు గాబోలు.

"పిచ్చివెధవ!" వీపు మీద కొట్టింది రమణి.

రమణి గుండెల మీద ఎత్తు పల్లాలు నన్ను గారడీ చేస్తున్నాయి.

"నీకు అసలు ఏం కావాలి?" రమణి ప్రశ్న- నిజంగా ఈ ఆడది అంటే ఏమిటి అంతలోనే చీకరించుకొని విదిలించి పారేస్తుంది. మళ్ళీ దేవత అయి ఏ వరాలు కావాలంటుంది.

రాత్రి తిరిగి ఎప్పుడు వచ్చి నాగదిలో పడుకున్నానో గుర్తు లేదు పదకొండు గంటలకి నిద్రలేచా. రమణి అప్పటికే తన గది ఖాళీ చేసి వెళ్ళిపోయింది. ఇంతలో ఇంటి దగ్గర రేవతి నుంచి టెలిగ్రాం వచ్చింది వెంటనే బయలుదేరి రమ్మంటూ.

రమణి పేర పదివేల రూపాయలకి చెక్ రాసి దాంతో చిన్న చిన్న ఉత్తరం జతచేసి ఆమె ఎడ్రస్‌కి పోస్ట్ చేసి వెంటనే రాజమండ్రి బయలుదేరా.

రాజమండ్రి వచ్చి "పదిహేను రోజులు అయింది. ఈ లోపల రమణికి రెండు ఉత్తరాలు రాశా. సమాధానం లేదు. హైదరాబాదు మళ్ళీ ఎప్పుడు వెళ్ళడమా అని ప్లాన్‌వేస్తున్నా. ఇంతలో రమణి నుంచి హటాత్తుగా ఉత్తరం వచ్చింది.

రాం!

పద్దెనిమిదేళ్ళ క్రితం సంగతి. విజయవాడ కాలేజీలో ఇద్దరు అమ్మాయిలు చదువుకునేవారు ఆ ఇద్దరికీ ఒక కథ ఇద్దామని గాబోలు ఓ షోకిల్లా రాయుడు తటస్థపడ్డాడు. అతను అందగాడేగాదు ఆశయాలు సిద్ధాంతాలు మానవతలకి పెద్ద ఫ్యాక్టరీగా చెలామణీ అయేవాడు.

సాధారణంగా అతను మా అమ్మాయిల సర్కిల్స్‌లో పెద్ద చర్చనీయాంశం. ఒక రోజు నా ఫ్రెండ్‌కి నాకు పందెం పడింది. కులం, కట్నం ప్రసక్తిలేకుండా నువ్వు పెళ్ళాడావని తను అంటే, నేను కాదని జరగదని వాదించా. ఇద్దరం పందెం కోసం నీకు తెలీకుండా నీతో విడి విడిగా పరిచయాలు పెంచు

కున్నాం.

నేను డబ్బు, కులంలేని దానిగా నీకు పరిచయం అయితే తను అన్నీ ఉన్నదానిగా పరిచయం అయింది. దురదృష్టవశాత్తు నేను నిజంగా నిన్ను ప్రేమిస్తే తను పందెం కోసం మాత్రమే పెళ్లాడింది. అందరు మగాళ్లలా నువ్వు ఇక్కడ డబ్బు హోదా చూశావ్. నిజానికి నాకు దానికన్నా పదిరెట్లు ఆస్థి ఉంది. కానీ ఆఖరికి నాకాళ్ల మీద పడి నిన్ను తనకి వదిలేయమంది. అలా మీ ఇద్దరికీ పెళ్లి అయింది.

—కానీ ఆ మాటలు కోతలు నీలో ఇంకా మారలేదు. అందుకే సిగ్గుపడ్తున్నా. హైదరాబాదులో ఆరాత్రి నా కాళ్లు పట్టుకొని వెధవ క్షణిక అనుభవం కోసం ఎన్ని మాటలు చెప్పావో! ఆ మాటలు ఎందరికి చెప్పావో నీకు గుర్తుండదు. కానీ ఈ దేశంలో దెబ్బ తిన్న ప్రతి స్త్రీకి నీ మగజాతి మొత్తం చెప్పే మాటలు తెలుసు.

నాతో అన్ని రోజులు వెంటతిరిగినా నీకు నేను ఎక్కడా గుర్తు రాకపోవడంలోనే మగజాతికి నువ్వెంత చక్కటి సీటు రాయివో అర్థం చేసుకున్నా.

ఈ దేశంలో ఆడది చాలా సిగ్గుమాలింది. నువ్వెవరో ఏమిటో తెలిసి కూడా ఆ రాత్రి నీ పని గడుపుకోడం కోసం క్షణంసేపు కాళ్ల మీదపడగానే కరిగిపోయా. ఎందుకో తెలుసా? నీ మీద నా మనస్సు పావక, నీ ఆలోచన్లు నాలో చావక. అదేదో జంతువుని ఎవరూ తినరట. తనను తనే తిని చచ్చిపోతుందట. ఆడదీ అంతే గాబోలు, మగాడిలో అన్నీ తెలిసీ అతని కౌగిలిలోకి వెళ్లిపోతుంది.

ఏం అయినా రేవతి కన్నా నేను అదృష్టవంతురాల్ని. దానిలాగా ప్రతిక్షణం "నా మొగుడు బయట ఎవర్తో ఏం చేస్తున్నాడో" అని భయపడక్కర్లేదు. భర్త అనేవాడు లేనందుకు ఒంటరిదనంలో నీమీద నీ మగజాతి మీద అసహ్యంతో ఈ నరకం అనుభవిస్తున్నందుకు ఆ తృప్తి ఉంది దానికి తాత్కాలిక రక్షణ సుఖం ఉన్నాయి. కానీ నాకు మనస్సు ఉంది. అందుకే ఏ సుఖంలేదు

నువ్వనుకొన్నట్లు నేను ఎవతి ఆలిసీ వెలయాలిసీ కాను.

నేను నేనే! నీ పదివేలు పంపిస్తున్నా. తీసుకో.

—రాధిక

## "సెక్స్"కి కూడా టాక్సు!

నార్వే దేశంలో, క్లబ్బులలోను వ్యభిచార గృహాలలోను చేరి డబ్బు సంపాదించే అందమైన అమ్మాయిలు విధిగా ఈ పన్ను చెల్లించవలసి ఉంటుంది. అయితే భార్య భర్తల సెక్స్ సంబంధాలకు మాత్రం ఈ పన్ను నుండి మినహాయింపు ఉంటుంది.

పసిఫిక్ మహాసముద్రంలో 8,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 'కుక్స్' అనే దీవి ఉంది. 1975 సరికి అక్కడ జనాభా ఎన్నోలక్షలు కాదు వేలుకూడాకాదు. అయితే వందలా? అదీ 21 మందే. అందువల్ల అక్కడ నిరుద్యోగ సమస్యా, ఆకలి సమస్యా తలెత్తడానికి వీల్లేదు.

ప్రజాతంత్ర